# పాపం నంబర్ వన్

ముత్యం మరోసారి ఆ కుర్రాడివంక చూసింది. ఈసారికూడా ఆ యువకుడు ముత్యం కళ్ళలో కళ్ళు కలిపి నవ్వాడు.

"టైం ఎంతయింది?" అడిగింది అతన్ని.

"ఒంటిగంటవుతోంది.... మీపేరు?"

"శ్రీదేవి"

ఆ యువకుడికి తెలుసు. బస్ స్టాప్‌లో అరగంటపైగా నిలబడి ఏ బస్సు ఎక్కకుండా సినిమాస్టార్ పేరుచెప్పే ఆడపిల్ల వేశ్య అని.

"మీరుండేది ఎక్కడ?" అడిగాడు.

"మలక్‌పేటలో, ఒక గదిలో ఒంటరిగా వుంటున్నాను. ఏదయినా వుద్యోగం చూపిస్తారా?" అడిగింది ముత్యం.

"ఏబై రూపాయలకో పనుంది చేస్తావా? రెండు మూడు గంటల పేపే ఆపని"

"అలాగే రెండురోజులనుంచి భోజనం లేదు." చెప్పింది ముత్యం.

"అరెరె టిఫిను తిందాం రండి" ఆహ్వానించాడు ఆ యువకుడు.

వందగజాల దూరంలోవున్న హోటల్ వైపు నడవసాగారు.

వయసు పాతికలోపే వుంది! మనసులో అనుకున్నాడా యువకుడు ఆమెను ఓరగాచూసి

"మీరేం చేస్తున్నారు?" అడిగింది ముత్యం.

"ఎ. పి, యస్. ఆర్. టి. సి.లో క్లర్కు"

"ఎంత జీతం?"

మీ "వయసెంత?"

"పద్దెనిమిది"

"నా జీతం నాలుగువేలు నెలకి"

"నెలకి క్లర్క్‌కి నాలుగు వేల రూపాయలా?" ఆశ్చర్యంగా అడిగింది ముత్యం

"పాతికేళ్ళ అమ్మాయి వయస్సు పద్దెనిమిదైనప్పుడు ఆర్. టి. సి. లో క్లర్క్‌లో నాలుగువేలయినా ఇవ్వరా?" అడిగాడు అమాయకంగా.

"గడుసే" చెప్పింది నవ్వుతూ.

ఫేమిలీ సెక్షనులో కూర్చున్నారిద్దరూ.

"ఏం తీసుకుంటారు?" అడిగాడు వెయిటర్ రాగానే.

"కాఫి చాలు"

"టిఫిను తీసుకోండి.... రెండు ప్లేట్స్ ఇడ్లీ. రెండు పెసరట్‌లు చెప్పు"

వెయిటర్ వెళ్ళాక చెప్పాడు.

"ఆకలిని భరించడం పాపం నంబర్ వన్. ఎందుకు మొహమాటం?"

పెసరట్టు సగం తిన్నాక యిక తినలేక వదిలేసింది ముత్యం. ఆ యువకుడు కాఫి ఆర్డరు చేశాడు.

"సిగరెట్ తాగితే అభ్యంతరమా?" అడిగాడు.

తల అడ్డంగా వూపింది ముత్యం.

ఆ యువకుడు లేచి వెళ్ళి వాష్ బేసిన్‌లో చెయ్యి కడుక్కున్నాడు.

రెండు కాఫీ కప్పులు తెచ్చి టేబిల్ మీద వుంచాడు వెయిటర్.

ఆ యువకుడికోసం ఎదురు చూస్తూ ముత్యం కాఫీ తాగలేదు. అయిదు నిమిషాలయినా రాలేదతను. అతనే తప్పమీద సాసర్‌ని వుంచి తను కాఫీ తాగేసింది వెయిటర్ బిల్ తెచ్చాడు.

అరగంట తర్వాత ముత్యానికి అర్థమయింది ఆ యువకుడి తెలివి.

"నా వంటిని అనేక మంది డబ్బిచ్చి వాడుకుంటే" ఇతను పైసా ఇవ్వకుండా ఇలా కొత్త రకంగా వాడుకున్నాడు" అనుకుంది ముత్యం బిల్లు చెల్లిస్తూ.

# జేబు దొంగ

ముప్పై ఒకటో తారీకు.

సాయంత్రం అయిదున్నర దాటుతుంది. నా అదృష్టాన్ని పరీక్షించు కోడానికి రద్దీగా వున్న ఆ సింగిల్ డెకర్ బస్‌లోకి ఎక్కాను సెక్రటేరియట్ దగ్గర. ఏ పర్సు తగిలినా మూడు నాలుగు వందలకి తక్కువ వుండదు.

ముందర నా కస్టమర్‌ని వెదుక్కున్నాను అలవాటుగా. తర్వాత పేంట్‌లోకి టెర్లిన్ షర్టు టక్ చేసిన ఆ యువకుడి వైపు అందర్నీ తోసుకుంటూ వెళ్ళాను. అతని చేతిలో ఇంగ్లీషు పత్రిక, టిఫిన్ బాక్సు వున్నాయి. జీతం తీసుకెళుతున్న వుద్యోగి.

దగ్గరగా జరిగి, బస్సు కుదుపులో లాఘవంగా అతని కుడిచేతి జేబులోంచి పర్సు కొట్టేసాను. నా పని పూర్తయింది. గుమ్మం వైపు మనుషుల్ని తోసుకుంటూ నడవ సాగాను. బస్సులోంచి ఎంత త్వరగా బయటపడితే అంత వుత్తమం.